


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అమ్మ

**స్టాఫ్ రూం సందడిగా** ఉంది. సుందర్రావు ప్రశంసల వెల్లువలో కొట్టుకుపోతున్నాడు. కారణం, అతను రాసిన ఓ పెద్ద కథ థీం నచ్చి ఓ ప్రముఖ నిర్మాత సినిమాగా తీయడానికి కొనుక్కున్నాడు. కొందరు మనస్ఫూర్తిగా అభినందిస్తూంటే, మరికొందరు అసూయ మొహంలో కనపడకుండా జాగ్రత్తగా పడుతూ పెదవుల చివరనించి అభినందనలు చెప్తున్నారు. అంతా సద్దుమణిగాక నా దగ్గరకొచ్చి కళ్ళెగరేసాడు.

"కంగ్రాట్స్ సుందర్" అతని చెయ్యందుకుని చెప్పాను.

"మనకీ ఫార్మాలిటీసేనా? విక్రమ్‌కి చెప్పావా?" నవ్వుతూ అడిగాడు.

"సభా మర్యాద. ఆఁ చెప్పాను. నీకు కాల్ చేస్తానన్నాడు. ఇంతకీ వాసంతి ఏమంటోంది?" అడిగాను.

"ఇంకా మేఘాల్లోనే ఉంది. కిందికి దిగలేదు. వాళ్ళిచ్చే రాయల్టీతో ఏం కొనుక్కోవాలో ఆలోచిస్తోంది."

"వెరీ హేపీ. సుందర్. నీకు వాసంతిలాంటిభార్య దొరికింది కాబట్టే నిశ్చింతగా రాసుకోగలుగుతున్నావు. నాలాంటి రాక్షసి దొరికితే అ, ఆలు మర్చిపోయేవాడివి" మనస్ఫూర్తిగా చెప్పాను.

"నిజం" సుందర్ చెప్పాడు.

"మరి పార్టీ ఎప్పుడు?"

"చెక్ కేష్ చెయ్యాలి."

"ఎంతేం?" ఆసక్తిగా అడిగాను.

సుందర్రావు నవ్వాడు కానీ జవాబు చెప్పలేదు.

సుందర్రావు, నేనూ ఒకేసారి ఈ కాలేజ్‌లో లెక్చరర్స్‌గా చేరాం. అప్పటికే నా పెళ్ళయిపోయింది. విక్రమ్ కూడా హైదరాబాద్‌లోనే పని చేస్తాడు. సుందర్రావు నేను అతి త్వరలో స్నేహితులమైపోయాం. ఉద్యోగంలో చేరిన ఆర్నెల్లకి

సుందర్రావుకి పెళ్ళయింది. వాసంతి మా స్నేహాన్ని అపార్థం చేసుకోలేదు కాబట్టి మా స్నేహం కొనసాగుతోంది. ఇప్పుడు వాసంతి కూడా నా బెస్ట్ ఫ్రెండ్

సుందర్రావు ఔత్సాహిక రచయిత. తను రాసిన రచనలని ముందే ఎవరికీ చూపించడు. 'అచ్చులోనే చదవాలి' అంటాడు ముందే చూపిస్తే మార్పులు, చేర్పులు చెప్తారని భయంట. బాగా రాస్తాడు. పత్రికలో చదివి మెచ్చుకుంటే సంతోషపడతాడు.

"ఇది నా ఒరిజినల్. ఎవరూ వేలు పెట్టకుండా స్వంతంగా రాసాను. ఇలా అనుకుంటే తృప్తిగా ఉంటుంది. అందుకే ముందుగా చూపించను. ఏమీ అనుకోవద్దు" ఒకసారి చెప్పాడు.

విక్రమ్ కూడా నాలాగా బాగా చదువుతాడు కాబట్టి, సుందర్ కథ చదివినప్పుడల్లా అతనికి ఫోన్ చేసి అరగంట పైగా మాట్లాడుతూంటాడు దాని గురించి. చిత్రంగా వాసంతికి పుస్తకాలు చదివే అలవాటు లేదు. ఇంటి పనులు, తీరిక సమయాల్లో టి.వి అంతే. కాని మంచి గృహిణి.

"ఈ మధ్య నీ కథలేవీ రావడంలేదు సుందర్? విక్రమ్ కూడా అడుగుతున్నాడు. గేప్ వచ్చిందేంటి?" ఆ రోజు స్టాఫ్ రూంలో అడిగాను.

"నవల రాస్తున్నాను హేమా" ఎసైన్‌మెంట్ పేపర్స్ దిద్దుతూ చెప్పాడు.

"వావ్! నవల!! ప్రమోషన్ అన్నమాట. ఐనా కష్టం కదూ నవల రాయడం? ఓ పది పదిహేను కథలు రాసినంత శ్రమ" చెప్పాను.

"అవును. కానీ బాగా వస్తోంది."

"సబ్జెక్ట్ ఏంటో? వద్దులే నువ్వెటూ చెప్పవుగా" నిష్టూరంగా చెప్పాను.

సుందర్రావు ముసిముసి నవ్వులు నవ్వాడు.

సుందర్రావు రాసిన మొదటి నవల 'మాతృవందనం'కి సాహిత్య అకాడమీ బహుమతి వచ్చింది. ఇంకా చాలా సంస్థలవాళ్ళు గుర్తించి సన్మానాలు చేసారు.

నిజంగా బాగా రాసాడు సుందర్రావు. ఓ తల్లి నిస్వార్థంగా తన కొడుకుని ఎలా పెంచి పెద్దచేసి ప్రయోజకుడ్ని చేసింది అన్నది ఇతివృత్తం. నవలంతా హృద్యమైన సన్నివేశాలు, బరువైన సంభాషణలతో చక్కగా సాగింది. రచయిత మొదటి నవల అన్న భావన ఎక్కడా రాలేదు.

మా కాలేజ్‌లో సుందర్రావుని అభినందించడానికి ఒక సభని నిర్వహించారు. సభానంతరం నన్నూ, విక్రమ్‌ని వాళ్ళింటికి భోజనానికి సుందర్రావు ముందే ఆహ్వానించాడు.

అతిథులు మాట్లాడాక సుందర్రావు మాట్లాడాడు. అతను అంత బాగా మాట్లాడగలడని నేను ఊహించలేదు.

ముందు తన సాహితీ ప్రయాణం, దాదాపు ఏభై కథలు రాయడంలాంటివి చెప్పాడు. తర్వాత తన తొలినవల గురించి చక్కగా వివరించాడు.

"మాతృవందనం అందరు అమ్మలకి సంబంధించింది. కానీ అందరు అమ్మలకన్నా మా అమ్మ నా దృష్టిలో ఎంతో గొప్పది. నాకు మూడేళ్ళప్పుడు మా నాన్న పోయారు. చిన్నవాడినైన నన్ను మా అమ్మ ఒంటిచేత్తో ఇంతవాడ్ని చేసింది.

చదువులేని అమ్మ నాకోసం బండపనులు చేసింది. నామీదే ప్రాణాలు పెట్టుకుని బతికింది. చదువుతోనే పేదవాడు ఏదైనా సాధించగలడనే విజన్ ఆ రోజుల్లోనే అమ్మలో ఉంది. పైసా పైసా కూడా బెట్టి నన్ను చదివించింది.

నేను ప్రయోజకుడ్ని అయ్యాక రెండు గదుల ఇల్లు అద్దెకి తీసుకుంటే, చూసి మురిసిపోయింది. మొదటిసారి గేస్ స్టవ్ కొన్నప్పుడు వంట ఇంత త్వరగా చేయచ్చా అని సంబరపడింది. సోఫా ఎంత నచ్చిందంటే, మా అమ్మ మధ్యాహ్నాలు అందులోనే పడుకునేది. నా స్వంతిల్లుని, అందులో తనకోసం ప్రత్యేకంగా నేను కట్టించిన గదిని చూసాక అమ్మ భోరున ఏడ్చింది. కష్టపడ్డాక ఫలం దక్కిన ఆనందం అది. అంత మంచి అమ్మ, నా బంగారు తల్లి ఏడాది క్రితం నిద్రలోనే ప్రశాంతంగా పోయింది. ముందురోజు రాత్రిదాకా అమ్మే నాకు వంటచేసి వడ్డించింది. నాకు పొలమారితే తలమీద తట్టింది..." దుఃఖంతో సుందరరావు మాట్లాడలేకపోయాడు.

స్టూడెంట్స్, లెక్చరర్స్ అంతా ఆపకుండా ఐదునిమిషాలపాటు చప్పట్లు కొడుతూనే ఉన్నారు.

"అలాంటి తల్లి గురించి రాసిన నా నవలకి సాహిత్య అకాడమీ పురస్కారం వచ్చిందంటే నాకు ఆశ్చర్యం కలగలేదు. ఎందుకంటే, దాని వెనక నా తల్లి చల్లని దీవెనలు ఉన్నాయని తెలుసు నాకు. నన్ను అభినందించడానికి సభ ఏర్పాటు చేసిన మన కళాశాల యాజమాన్యానికి నా కృతజ్ఞతలు" చెప్పి సుందరరావు స్టేజ్ మీద పెద్దలకి చేతులు జోడించి నమస్కారం పెట్టాడు.

"సుందర్. గ్రేట్!" విక్రమ్ స్టేజ్ దిగి వచ్చిన సుందరరావుని కౌగలించుకున్నాడు. అంతా సుందరరావు ఇంటికి చేరుకున్నాం.

"వాసంతీ నువ్వు రాలేదే? సన్మాన సభ ఎంత గొప్పగా జరిగిందో. విక్రమ్ రికార్డ్ చేసాడులే. నీకు పంపమని చెప్తా" వంటగదిలో హడావిడిగా ఉన్న వాసంతిని అడిగాను.

"నేను వస్తే ఈ పనంతా ఎవరు చేస్తారు?" నవ్వుతూ అడిగింది.

"అయ్యో! పార్టీ మరోసారి పెట్టుకోవాల్సింది."

"పర్లేదు రావటం నాకిష్టంలేదు. మంచి వంక దొరికింది" మరోసారి నవ్వింది.

"ఇష్టంలేదా?"

"అవును. మా అత్తగారికి జరిగే సన్మానం అది. మా వారికి కాదు జరిగింది."

"అయితే?" ఆశ్చర్యంగా అడిగాను.

వాసంతి ఓసారి ముందు గదిలోకి చూసి గొంతు తగ్గించి చెప్పింది.

"నాకు మా అత్తగారంటే అసహ్యం హేమా. అందుకే రాలేదు."

"అదేంటి వాసంతీ. సుందర్ ఆ పుస్తకంలో వాళ్ళమ్మ గురించి ఎంతబాగా రాసాడో తెలుసా? చదివిన ప్రతీవారికి ఆమెకి చేతులెత్తి దణ్ణం పెట్టాలనిపిస్తుంది తెలుసా?"

"అబ్బో!" వాసంతి మూతి ముప్పై వంకరలు తిప్పింది.

ఆమె ప్రవర్తన నాకు విచిత్రంగా ఉంది. నాకు తెలిసి వాసంతి చాలా మంచి ఇల్లాలు మంచి మనిషి.

వాసంతి మరోసారి ముందుగదిలోకి తొంగి చూసి చెప్పింది.

"మా అత్తగారో బ్రహ్మ రాక్షసి హేమా. నన్నెంత హింసపెట్టిందో ఎవరికీ తెలియదు. ఆవిడకి చాలా చిన్న వయసులోనే, అంటే ఇరవై రెండేళ్ళకే భర్తపోయాడు. దాంతో కొడుకు కోడలు నవ్వుతూ కబుర్లు చెప్పుకున్నా, పక్కపక్కన

కూర్చున్నా భరించలేకపోయేది. ఆ కొడుకు మీద విపరీతమైన ప్రేమ. దాంతో వాళ్ళ మధ్యకి వచ్చిన కోడలి మీద విపరీతమైన ద్వేషం. లోకానికి వెరిచి కాని లేకపోతే కొడుక్కి పెళ్ళికూడా చేసేది కాదు మహాతల్లి. నేను నుంచుంటే తప్పు, కూర్చుంటే తప్పు అని టార్చర్ పెట్టింది. తనే వంట చేయాలి, కొడుక్కి తనే వడ్డించాలి. తనే కబుర్లు చెప్పాలి."

వాసంతి ఇంకాస్త గొంతు తగ్గించి చెప్పింది.

"నాకు ఇంతకాలం పిల్లలు పుట్టకపోవడానికి కూడా కారణం ఆవిడే మమ్మల్ని కాపురం చేయనిస్తేగా పిల్లలు పుట్టడానికి. అలాంటి సేడిస్ట్ గురించి ఆయనేదో పిచ్చి కథ రాస్తే దానికి అవార్డ్‌లు, సన్మానాలు..."

నాకు ఏం మాట్లాడాలో అర్థంకాలేదు.

'అమ్మ కూడా ఒక అత్తేగా' అని మాత్రం అనుకున్నాను.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments